క్లుప్తంగా

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఐదు వాహనాలు స్వాధీనం



నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ విజయ భాస్కరరావు, టూటౌన్ సీఐ వీరేంద్రబాబులు తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై తమ్మిశెట్టి శివనాగరాజు, దారపనేని వెంకట సాంబశివరావు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంబడించి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా ద్విచక్రవాహనాలు దొంగలించి విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు నేరాన్ని అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో చోరీకి గురైన ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువకుడి ప్రాణాలు తీసిన అప్పులు



నరసరావుపేట రూరల్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రావిపాడులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు రావిపాడు గ్రామానికి చెందిన అముదాల వెంకట శ్రీనివాసరావు (31) గతంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కార్యాలయ సిబ్బందిగా పనిచేసేవాడు. తన తండ్రి ఆరోగ్యం దెబ్బతినడంతో ఆయనకు తోడుగా కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. తండ్రి ఆసుపత్రి ఖర్చుల కోసం అప్పులు కావడంతో పాటు వ్యవసాయం కూడా కలిసి రాకపోవడంతో అప్పుల భారం పెరిగింది. దీంతో ఈనెల 19వ తేదీ బుధ వారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసరావు వల్లప్పచెరువు నుంచి కేతముక్కల అగ్రహారం వెళ్లేదారిలో పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి భార్య చంద్రకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

శావల్యాపురం సర్పంచ్‌గా చెన్నమ్మ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా యాగసిరి చెన్నమ్మను నియమాకం ధృవీకరణ పత్రాన్ని అందజేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించిన రాపూరి వెంకాయమ్మ దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న యాగసిరి చెన్నమ్మను సర్పంచ్‌గా నియమాకం చేసినట్లు చెప్పారు. ధృవీకరణ పత్రం అందుకున్న వారిలో మండల కోఆప్షన్ సభ్యు లు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి రవి, బాబు, కొణతం ఎరుకల రెడ్డి, ఏసురాజు,పాట్టిపాటి శ్రీను ఉన్నారు.

సహోద్యోగిని ఆదుకోవాలనే సంకల్పం గొప్పది



నరసరావుపేట: ఆపదలో ఉన్న తమ సహోద్యోగి కుటుంబానికి సహాయం అందించాలనే సంకల్పం, సేవా దృక్పథం ఎంతో గొప్పదని అదనపు ఏ.ఎస్పీ రామచంద్రరాజు కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సహచర హెడ్‌కానిస్టేబుల్ తాళ్లూరి సూర్యనారాయణ కుటుంబానికి తోటి 1993వ బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు అందించిన ఆర్థిక సహాయం రూ.1.4 లక్షల గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుడి కుమార్తె ప్రవల్లికకు అందజేశారు. స్థానిక రూరల్ పోలీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల 12న రోడ్డు ప్రమాదంలో సూర్యనారాయణ మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఇదే ఐక్యత, ఉదారత భవిష్యత్‌లో కూడా కొనసాగించాలంటూ 1993 బ్యాచ్ వారిని అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ తోడుగా, అండగా ఉంటుందన్నారు. వారికి శాఖాపరంగా రావల్సిన అన్ని బెనిఫిట్లను అందిస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏఏవో రామారావు, ఎస్పీ సీసీ ఇఇ కోటేశ్వరరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాల రావు, ఏఎస్సై ఆంజనేయులు, భాస్కర్ రావు, అంకినీడు ప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శక పాలనే నాయకుల ఆత్మస్థైర్యం

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన
- మరికొన్ని రోజులు కార్యక్రమం పొడిగింపు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో గురువారం ముప్పాళ్ళ మండల సమీక్షలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకే 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమని నిర్వహించటం జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు ప్రవేశ పెట్టి ప్రజలకు మేలు చేస్తున్నామని అంబటి పేర్కొన్నారు. ప్రభుత్వ పారదర్శక పరిపాలనతోనే నియోజకవర్గ నాయకులకు ఆత్మస్థైర్యం కలిగిందని, ప్రశాంతంగా ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు. మరి కొద్ది రోజులు పాటు ఈ కార్యక్రమం పొడిగించడం జరిగిందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో జెసీఎస్ మండల ఇన్‌చార్జ్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సిరిగిరి గోపాలరావు, నక్క శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లి గడ్డ ఎత్తిన.. సత్యన్న విగ్రహావిష్కరణ..

పట్టణంలోని తాలూకా సెంటర్‌లో సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్యన్న విగ్రహావిష్కరణ శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. విగ్రహావిష్కరణ, బహిరంగ సభ, భోజనాల ఏర్పాట్లను మంత్రి అంబటి రాంబాబు పర్యవేక్షించారు. తాలూకా సెంటర్లో బహిరంగ సభ ప్రాంతాన్ని పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఉండేలా సూచనలు చేశారు. విగ్రహ విష్కరణకు వచ్చే వారికి పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కేంద్రియ విద్యాలయ ప్రాంగణాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల, పెదకూరపాడు ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద రావు, ఏసురత్నం, మర్రి రాజశేఖర్, నాయకులు హాజరవుతారని వెల్లడించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబ శివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రామ గ్రామాన జగన్నినాదం

నకరికల్లు: గ్రామ గ్రామాన జగన్నినాదం మార్మోగుతోందని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా జరిగింది. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి, ప్రజల మద్దతు తీసుకున్నారు. వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు.

ప్రభుత్వ, జెడ్పీ భూములను కాపాడాలి

జిల్లా పరిషత్తు ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దారు నగేష్, పక్కన ఎంపీడీఓ సత్య నారాయణ

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలో ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్తు భూములను శాఖలతో సంబంధం లేకుండా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సంయుక్తంగా కాపాడాలని సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన జిల్లా పరిషత్తు ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని కార్యక్రమ కన్వీనర్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణం, మండలంలోని జెడ్పీ ఆస్తుల వివరాలను సర్వే నంబర్లు, వైశాల్యంతో సహా గ్రామాల వారీగా వెల్లడించారు. ఈ ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదిక అందించాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలను ఆదేశించారు. మండల విస్తరణాధికారి బి.దయాసాగర్ మాట్లాడుతూ ఆస్తుల పరిరక్షణకు గ్రామ, పట్టణ ప్రాపర్టీ రిజిస్టర్ నిర్వహించాలని చేయాలని సూచించారు. కమిటీ సమావేశాన్ని ఈ నెల 25న మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబూన్ బీ , వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఏవో బసవకుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ డి.శివయ్య, సత్తెనపల్లి టౌన్ సర్వేయర్ కె.జయకుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ పి.రాఘవరావు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ని ఉపయోగించుకోండి



ఇంటి వద్దే బాలింతకు సూచనిలస్తున్న డాక్టర్ రవితేజ

రాజుపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రవితేజ నాయక్ పేర్కొన్నారు. అంచులవారి పాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. 85 మందికి డాక్టర్ రవితేజ నాయక్ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇంటికే పరిమితమైన రోగులను, గర్భిణులు, బాలింతలకు పరీక్షించి, మందులు ఇచ్చారు. పరీక్ష చేశారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో నెలకు రెండు సార్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కమ్యునిటీ అధికారి శిరీష, ఏఎన్ఎం నాగేంద్రం, హెల్త్ అసిస్టెంట్ హుస్సేన్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సిలిండర్ మంటల నియంత్రణపై అవగాహన

సత్తెనపల్లి: వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే.. అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి అలా శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అబ్బూరు గ్రామంలో నిర్వహించిన ముగింపు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు, మంటల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదాల నివారణపై ప్రత్యక్షంగా డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ షేక్. గౌస్, ఆపరేటర్ పీఎస్ రామకృష్ణారావు, సాగర్ బాబు, సిబ్బంది కె.శ్రీని వాసరావు, రమణ నాయక్, నాగేశ్వరరావు, హోంగార్డ్ షేక్ బాజ్జీ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు విధులు పారదర్శకంగా నిర్వహించాలి

తహసీల్దారు జాన్ సైదులు

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత ఆయా గ్రామాల్లోని బీఎల్‌వోలపై ఉందని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు నూతన ఓట్లు అర్జీలు స్వీకరణ, తిరస్కరణ, ఆన్‌లైన్ ఓట్లు దరఖాస్తులు తదితర వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి ఫాం–6లు 800 అర్జీలు రాగా అందులో 105 తిరస్కరించినట్లు చెప్పారు. ఫాం–7లు 722 రాగా 84 అర్జీలు తిరస్కరించమన్నారు. సమగ్ర వివరాలతో ఓటు హక్కు కోసం అర్జీ చేసుకున్న వారందరికీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ధారణ అయినటు వారికి పార్టీలకు అతీతంగా ఓటు హక్కు కల్పించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్న పక్షంలో తక్షణమే మండల స్థాయి అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఓట్లు చేర్పులు, తొలగింపులు విషయంలో ఫిర్యాదులకు వివాదాలకు తావులేకుండా తమ విధులు పారదర్శకంతో ఉండాలన్నారు. బీఎల్‌వోలు తమ విధుల అంకిత భావంతో నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఆర్ఐ చంద్రబాబు పాల్గొన్నారు.

పీజీ కోర్సులపై అవగాహన సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అనిత

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని వివిధ కళాశాలలో విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సదస్సులలో అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ డిగ్రీ అనంతరం పీజీ కోర్సులను చదవటం వలన కలిగే ప్రయోజనాలను తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు, క్రీడలకు వర్సిటీ ఇస్తున్న ప్రాధాన్యత, డాక్టరేట్ చేసేందుకు ఉన్నటువంటి అవకాశాలు, హాస్టల్ వసతి, తదితర అంశాలను వివరించారు. అలాగే ఏపీ పీజీ సెట్–2023పై అవగాహన కలిగించారు. పీజీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అడ్మిషన్లు వివరాలను తెలిపారు. పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, పీఎన్‌సీ అండ్ కె.ఆర్.డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన సదస్సులలో వర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీ, సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎం.త్రిమూర్తిరావు, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుకూలమైన కోర్సులు ఎంచుకోవాలి

రాజుపాలెం: విద్యార్థులు తమకు అనుకూలమైన కోర్సులను ఎంచుకుంటే త్వరగా జీవితంలో స్థిరపడతారని విశ్రాంత ఐఏఎస్ అధికారి రావల సుబ్బారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పథ సంస్థ కార్యాలయ ఆవరణలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు వారు ఎంచుకునే కోర్సులపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బారావు కోర్సులపై క్లుప్తంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనందకుమార్, గుమ్మడి శ్యాంకుమార్, మాణిక్యరావు, సంస్థ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ యోహాన్‌రాజు, ఉపాధ్యాయులు డి.బెంజిమెన్, సీఆర్పీ కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పువ్వాడ హెచ్‌ఎం, ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నూజెండ్ల : విధి నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయునితో పాటు, మరో ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు నూజెండ్ల ఎంఈఓ సాంబశివరావు గురువారం తెలిపారు. నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామంలో ప్రధానోపాధ్యాయుని గా పనిచేస్తున్న నాగుల షరీఫా, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శశి సుమంత్ ఇరువురు విద్యార్థుల ముందు ఘర్షణ పడుతూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎంఈఓ జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించారు. గురువారం సాయంత్రం శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్యను, సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై సర్పంచ్, ఎంపీడీవోను స్వయంగా కలిశారు.


ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



వినుకొండలో మాట్లాడుతున్న డాక్టర్ కుర్రా శ్రీనివాసరావు

వినుకొండ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దంత వైద్య నిపుణులు కుర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు. పరిసర ప్రాంత ప్రజలకు గ్యాస్ సిలిండర్ లీకేజీ, షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐసీఎస్ఎఫ్ ఎం. శ్రీనివాసరావు, డీఓపి రమణారెడ్డి, ఎల్ఎఫ్‌లు డి. ప్రకాష్‌రావు, ఎ. వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు, హోంగార్డ్స్ పి. బాషాఖాన్, జి. రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రార్థన స్థలాల పవిత్రత కాపాడాలి



పురుషోత్తమపట్నం ఈద్గా వద్ద పనులు పర్యవేక్షిస్తున్న రఫాని, గోవిందరావు

చిలకలూరిపేట: ప్రార్థనా స్థలాల పవిత్రత కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నం లోని ఈద్గా మైదానాలను మున్సిపల్ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఆక్రమణలను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, టీపీఎస్ కె సునీత, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌ఆలి, 27వార్డు ఇన్‌చార్జి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకొన్న ఎమ్మెల్యే శంకరరావు



ఎమ్మెల్యే నంబూరును సత్కరిస్తున్న స్థానిక నాయకులు

పీసపాడు(క్రోసూరు): పీసపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి ఆలయ 14వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలందరినీ చల్లగా, సంతోషంగా చూడాలని అమ్మవారని ప్రార్థించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనను సత్కరించారు.

కార్యకర్త మృతికి నివాళి

88త్యాళ్లూరు(క్రోసూరు): 88త్యాళ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఊటుకూరు రాజు పనుల నిమిత్తం కేరళ వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, గార్లపాటిదాసు, మేదర రోశయ్య, అత్తోట అప్పారావు, వేజండ్ల రవి ఆయన వెంట ఉన్నారు.

అధైర్యపడొద్దు .. ఆదుకుంటాం

పెదకూరపాడు: అధైర్యపడొద్దు.. ఆదుకుంటామని లివర్ బాధితుడికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హామీ ఇచ్చారు. కాశిపాడు గ్రామానికి చెందిన మల్లెల రాజేష్ కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళగిరి ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. రాజేష్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రాజేష్‌కు అవసరమైన వైద్య ఖర్చులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందేలా చూస్తామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు.

చంద్రబాబు ఫ్లెక్సీలు చించేసిన టీడీపీ నేతలు



సత్తెనపల్లిలో చిరిగిన చంద్రబాబు ఫ్లెక్సీ



ఫ్లెక్సీలు చించినవారిపై చర్యలు తీసుకోవాలని వైవీ, రామస్వామిని నిలదీస్తున్న శ్రీనివాస్

- చించిన వారిని అరెస్ట్ చేయాలంటూ ఒక వర్గం ఆందోళన
- సముదాయించిన మాజీ ఎమ్మెల్యే వైవీ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద ఒక వర్గం పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మరో వర్గం చించివేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో భాగంగా టీడీపీకి చెందిన కోడెల శివరామ్, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు వర్గాలతో పాటు పార్టీ నాయకులు మరి కొందరు బుధవారం రాత్రి నుంచే ఫెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన చంద్రబాబు ఫ్లెక్సీలను టీడీపీకి చెందిన మరో వర్గం నాయకులు చించేశారు. దీంతో తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షుడు యెల్లినేడి శ్రీనివాస్ గురువారం ఎన్టీఆర్ భవన్ ఎదుట మెట్లపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఫ్లెక్సీలను చించేసిన అల్లరి మూకలను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి ఎన్టీఆర్ భవన్ వద్దకు చేరుకొని శ్రీనివాస్‌ను సముదాయించారు. అయినప్పటికీ ఆయన ససేమిరా అంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కొద్ది సేపటి తరువాత ఆందోళన విరమించాడు. కాగా ఫ్లెక్సీలు చించినవారిపై పోలీస్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు.

బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

అమరావతి: బాలికలు విజయం సాధించాలంటే ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని, ముందుకు సాగాలని బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో–ఆర్డినేటర్ ఎ.తిరుపతిరావు అన్నారు. గురువారం స్థానిక గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిశోర బాలికల జీవన నైపుణ్యాల అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిశోర బాలికల ప్రాజెక్టు ప్రతినిధి దిలీప్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడారు. నేటి సమాజంలో బాలికలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తోందన్నారు. బాలికలలో ఆత్మస్థైర్యం, క్రిటికల్ థింకింగ్, ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే శక్తి, సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలంటే విద్య చాలా ముఖ్యమన్నారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణ, అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ డయానా, మరియమ్మ, బాబు రావు, లలిత, కవిత పవన్ పాల్గొన్నారు.

పెట్రోల్ కోసం ఆగితే.. దూసుకొచ్చిన మృత్యువు



మృతి చెందిన రాము

మాదల(ముప్పాళ్ళ): రోడ్డు మార్జిన్‌లో నిలబడి ఉన్న వ్యక్తి.. ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మాదల సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సత్తెనపల్లి మండలం బీమవరం గ్రామానికి చెందిన దామచర్ల రాము(52) మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై మాదల మహంకాళీ అమ్మవారి తిరునాళ్లకు వచ్చాడు. ఈ క్రమంలో మాదల సమీపంలోని బంకులో ఒకరు పెట్రోల్ పట్టిస్తుండగా.. రాము రోడ్డు పక్కన నిలబడి ఉన్నాడు. అదే సమయంలో నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన పూదోట దిలీప్, రంగారెడ్డిపాలేనికి చెందిన చాగంటి రాకేష్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వస్తూ రామును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో రాము తలకు తీవ్ర గాయమై.. అక్కడికక్కడే మృతి చెందాడు. దిచక్ర వాహనంపై ఉన్న ఇరువురికీ గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

మిషన్ శోభాకృత్‌లో భాగంగా జీపు వేలం

వినుకొండ(నూజెండ్ల): మిషన్ శోభాకృత్ పథకంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని జీపును వేలం వేశారు. ఈ వేలం కార్యక్రమంలో పులిచింతల డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో నలుగురు పాల్గొనగా ప్రకాశం జిల్లా అడ్డరోడ్డుకు చెందిన పఠాన్ ఆదాం షఫీ అనే వ్యక్తి రూ.33వేలకు వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.